


www.mb9news.in R.NO : TS-11-0011054

# మన భద్రాద్రి న్యూస్

మన అక్షరం ....... ప్రజల ఆయుధం

డిజిటల్ తెలుగు దినపత్రిక

మంగళవారం 22, ఏప్రిల్ 2025


# హోమ్‌లోన్స్ పేరుట నిరుపేదలకు గాలం..!

- ఆశతో అప్పుల ఊబిలోకి దిగుతున్న నిరుపేదలు
- లేని వ్యాపారాన్ని ఉందని చూపించి లక్షల్లో సొమ్ము చేసుకుంటున్న బ్రోకర్లు
- ఊరి ఊరికి పాకిన ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలు
- అధికారులు దృష్టి సారించకపోతే ముప్పు తప్పదు అంటున్న నిపుణులు





**చంద్రుగొండ, మన భద్రాద్రి న్యూస్, ఏప్రిల్ 21**

గతంలో ఫైనాన్స్ కంపెనీలు పదిమందికి కలిపి లోన్లు మంజూరు చేసి నెలనెలా వాయిదాల రూపంలో తీసుకునేవారు. కానీ అవి అంతరించిపోయాక ఇప్పుడు కొన్ని ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలు హెూమ్ లోన్ల పేరిట ఘరానా మోసానికి తెరతీస్తున్నాయి. నిరుపేదలను ఆసరాగా చేసుకుని వీళ్ళకి 15 లక్షలు, 20 లక్షలు లోన్ ఇస్తామని ఆశ చూపి అప్పుల ఊబిలోకి లాగుతున్నారు. మొత్తం కాగితాలు మేమే చూసుకుంటామంటూ ప్రతినెలా మీరు వాయిదాలు చెల్లిస్తే సరిపోతుంది అని చెప్పి లోన్లు మంజూరు చేస్తున్నారు. లోన్లు మంజూరు చేసినందుకు గాను లక్షకు 3 శాతం సొమ్ము చేసుకుని లక్షల్లో పోగేసుకుంటున్నారు. ఇంటిని రిజిస్ట్రేషన్ చేస్తామని ఇల్లు రిజిస్ట్రేషన్ కింద 80 వేల రూపాయలు అదనంగా ఖర్చవుతుందని, అది కూడా లోన్ లో తీసేసి మిగతా డబ్బులు మీకు వస్తాయని చెప్పి లోన్లు మంజూరు చేస్తున్నారు. మీకు ఎటువంటి షరతులు లేకుండా 20 లక్షలు 10 లక్షలు వస్తాయని చెప్పేసరికి చాలామంది నిరుపేదలు అప్పుల ఊబిలోకి దిగిపోతున్నారు.

# ఐటీడీఏ పీవోను అభినందించిన ఎమ్మెల్యే తెల్లం

-నూతన ఫ్రీ ఫ్యాబ్రికేటెడ్ భోజనశాల ప్రారంభోత్సవం





**భద్రాచలం, మన భద్రాద్రి బ్యూరో, ఏప్రిల్ 21**

గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమం పాఠశాలలో చదువుతున్న గిరిజన విద్యార్థినీ విద్యార్థుల విద్యాభివృద్ధి కొరకు మరియు గిరిజన సాంప్రదాయాలను నేటితరం యువతీ యువకులు ఆచరించే విధంగా కృషి చేస్తున్న ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ను అభినందిస్తున్నట్లు భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు అన్నారు. సోమవారం పట్టణంలోని కుర్రాజుల గుట్టలోని ఏహెచ్ఎస్ బాలుర ఆశ్రమ పాఠశాలలో 25 లక్షల 50 వేల వ్యయంతో నూతనంగా నిర్మించిన ఫ్రీ ఫ్యాబ్రికేటెడ్ భోజనశాలను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థినీ, విద్యార్థుల విద్యాభ్యాసంతో పాటు వారికి అన్ని రకాల సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, అందుకు విద్యార్థులు తల్లిదండ్రులు మీ మీద పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా, బాగా చదివి వృద్ధిలోకి రావాలని సూచించారు. ఐటీడీఏ పీవో గా బాధ్యతలు తీసుకున్నప్పటి నుండి అహర్నిశలు గిరిజన సంక్షేమం కొరకే ఆయన పాటుపడుతున్నారని, అలాగే గిరిజన సంస్కృతి సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు అంతరించిపోకుండా నేటితరం గిరిజన యువతి, యువకులు కాపాడుకోవడానికి, ఎనలేని కృషి చేస్తూ పాతతరం గిరిజన కళాఖండాలను సేకరించి గిరిజన మ్యూజియం ఏర్పాటు చేయడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని ఆయన అన్నారు. అనంతరం ఐటీడీఏ పీవో బి. రాహుల్ మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థిని, విద్యార్థులే కాక 8వ, 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులు పదో తరగతి అయిపోయిన తర్వాత భవిష్యత్తులో ఏ రంగంలో స్థిరపడాలని అనుకుంటున్నారో, ఇప్పటి నుండే కెరీర్ గైడెన్స్ పై అవగాహన కల్పించే ఉద్దేశంతో విద్యా ఉద్యోగ సమాచారం పిల్లలందరూ తెలుసుకునే విధంగా పాఠశాలల్లో ఏర్పాటు చేయడం జరిగిందని, చాలా వరకు పిల్లలు అర్థం చేసుకున్నారని, ఇప్పటినుండే తప్పనిసరిగా విద్యార్థినీ, విద్యార్థులు ప్రత్యేక దృష్టి సారించి ప్రణాళికలు రూపొందించుకోవాలని అన్నారు. కెరీర్ గైడెన్స్ కు సంబంధించిన అంశాలు విద్యార్థిని, విద్యార్థులు అర్థం చేసుకొని వేసవి సెలవులలో ఇండ్లకు వెళ్లినప్పుడు తప్పనిసరిగా జీవితంలో ఏమి కాదలుచుకున్నారో మననం చేసుకొని జీవితంలో స్థిరపడటానికి ఒక మార్గాన్ని ఎంచుకోవాలని అన్నారు. ప్రతిరోజు నూతనంగా ప్రవేశపెట్టిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్నది లేనిది విద్యార్థులను అడిగి తెలుసుకొని విద్యార్థులతో కలిసి వారు భోజనం రుచి చూశారు. వేసవి సెలవులు ఇవ్వగానే విద్యార్థులు వారి ఇండ్లకు వెళ్లిపోతారని, సంబంధిత ప్రధానోపాధ్యాయులు, వార్డెన్ లు పాఠశాలల్లో ఏమైనా మైనర్ రీపేర్లు ఉంటే ఇంజనీరింగ్, గిరిజన సంక్షేమ అధికారులు పాఠశాలల నుండి వివరాలు తెప్పించుకొని వేసవి సెలవులు ముగియగానే విద్యార్థినీ విద్యార్థులు వారి పాఠశాలలకు చేరుకునే సమయంలో వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని మణెమ్మ, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ చంద్రశేఖర్, ఏ టి డి ఓ అశోక్ కుమార్, హెచ్ఎం నరేందర్, డీఈ హరీష్, టీఏ శ్రీనివాసరావు, ఏఈ ప్రసాద్, వార్డెన్ మోహన్ మరియు పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# హెూమ్ లోన్స్ పేరిట నిరుపేదలకు గాలం..!

మొదటి పేజీ తరువాయి



ప్రతి ఊరిలో 10 లక్షల లోన్ ఇప్పిస్తామంటూ పదుల సంఖ్యలో బ్రోకర్లు దర్శనమిస్తున్నారు. కొంతమంది ఏజెన్సీ పరిధిలో రిజిస్ట్రేషన్ ఎలా అవుతుందని అడగగా బదులుగా మీ ఇంటిని పార్టీషన్ రిజిస్ట్రేషన్ అని, కొన్ని సంవత్సరాల తర్వాత మీకు గవర్నమెంట్ బ్యాంక్స్ లోన్ ఇస్తాయని చెప్పి లోన్లు మంజూరు చేస్తున్నారు. అసలు ఏజెన్సీ ప్రాంతంలో ఎటువంటి సరైన అనుమతులు లేకుండా ఇలా ఇష్టానుసారంగా పలు రకాల లోన్లు అంటూ నిరుపేదలను అప్పుల ఊబిలోకి లాగేందుకు ప్రయత్నిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో వారు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి వస్తుందని పలువురు నిపుణులు పేర్కొంటున్నారు. ఏది ఏమైనా ఈ హెూమ్ లోన్స్ ఊరి ఊరికి పాకి బ్రోకర్లు సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు ఇటువంటి లోన్లపై దృష్టి సారించి పేదలను అప్పుల ఊబి నుంచి నుంచి కాపాడకపోతే పరిణామం పెద్ద స్థాయిలో ఎదుర్కోవాల్సి వస్తుందంటూ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# ఏసీబీకి చిక్కిన మణుగూరు సీఐ, బిగ్ టీవీ విలేకరి

– ఓ భూమి కేసులో 4లక్షలు డిమాండ్



**మణుగూరు, మన భద్రాద్రి బ్యూరో, ఏప్రిల్ 21**

ఓ భూమిలో కేసులో 4లక్షల రూపాయలు డిమాండ్ చేసిన మణుగూరు సీఐ సోమ సతీష్ కుమార్ ని సోమవారం ఖమ్మం ఏసీబీ అధికారులు వలపన్ని అడ్డంగా పట్టుకున్నారు. సోమవారం ఏసీబీ అధికారులు విషయం తెలుసుకుని మణుగూరు పోలీస్ స్టేషన్ పై మెరుపు దాడి చేశారు. మణుగూరు మండల కేంద్రంలో సీఐ సతీష్ కుమార్ గత నెల రోజుల నుంచి ఓ భూమి విషయంలో తలదూర్చి బాధితులను ఇబ్బంది పెడుతున్నట్లుగా తెలిసింది. ఆ భూమి విషయంలో సీఐ సదరు బాధితులను బెదిరించినట్లు వినపడుతోంది.

అయితే సీఐ కి మధ్యవర్తిగా మణుగూరు మండల బిగ్ టీవీ రిపోర్టర్ గోపి వ్యవహరించి డబ్బులు వసూళ్లు చేసినట్లు వినపడుతోంది. అయితే భూమి విషయంలో 4 లక్షలు రూపాయలు డిమాండ్ చేయగా ఒక లక్ష రూపాయలు సదరు భాదితులు ఇచ్చినట్లు తెలిసింది. ఆ లక్ష రూపాయలు సీఐ తీసుకోవడంతో ఏసీబీ అధికారులు రెడ్ హాండెడ్ గా రసాయనిక పరీక్షలు చేసి అభియోగాలకి బలమైన ఆధారాలు సేకరించి పట్టుకున్నారు. సీఐతో పాటు మధ్యవర్తిగా వ్యవహరించినందుకు బిగ్ టీవీ రిపోర్టర్ గోపి ని పట్టుకున్నారు. వీరిపై కేసు నమోదు చేయగా సీఐ సతీష్ ని ఏ1,రిపోర్టర్ గోపి ఏ2 గా చేశారు. వీరిపై సెక్షన్లు: 318(4), 329(3) బిఎన్ఎస్ మరియు తెలంగాణ స్టేట్ గేమింగ్ (సవరణ) చట్టం సెక్షన్ 5 కేసు నమోదు చేశారు. ఇద్దరినీ అరెస్ట్ చేసి వరంగల్ ఎస్పీఈ, ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో వ్యక్తులకు జరిమానా

**కొత్తగూడెం లీగల్, మన భద్రాద్రి బ్యూరో, ఏప్రిల్ 21**

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో పరువురు వ్యక్తులకు జరిమాన విదిస్తూ కొత్తగూడెం స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మెండు రాజమల్లు గురువారం తీర్పు చెప్పారు. కేసులు వివరాలు ఇలా ఉన్నాయి. పాల్వంచ టౌన్ ఎస్ఐ, డి. రాఘవయ్య వాహనాలు తనిఖీ చేయుచుండగా ఒక్కరు అతిగా మద్యం తాగి తమ తమ వాహనం నడుపు చుండగా అతనిని ఆపి బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరీక్షించగా అతిగా మద్యం త్రాగినట్లు రికార్డు కాగా అతనిని కోర్టులో ప్రవేశపెట్టగా అట్టి కేసులో నేరం అంగీకరించి జరిమానా చెల్లించడం తో పాటు ఈరోజు మూడు గంటల పాటు ప్రభుత్వ ఆసుపత్రి పాల్వంచలో మెడికల్ సూపరింటె%శీ%డెంట్ ఆదేశించిన సర్వీసులను చేయాలని ఆదేశించారు. మరియు కొత్తగూడెం త్రీటౌన్ ఎస్ఐ పురుషోత్తం వాహన తనిఖీ చేయుచుండగా ఒక వ్యక్తి అతిగా మద్యం తాగి వాహన%శీ% నడుపుచుండగా బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరీక్షించగా మద్యం తాగినట్టుగా రుజువుగా కొత్తగూడెం కోర్టులో ప్రవేశపెట్టగా నేరం అంగీకరించగా జరిమానా అతను చెల్లించారు. కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్ఐ కె. నరేష్ వాహన తనిఖీ చేయుచుండగా మద్యం త్రాగి 8 మంది వాహనములు నడుపుచుండగా వారిని పరీక్షించగా మద్యం తాగినట్టు రుజువు కాగా వారిని కోర్ట్ లో ప్రవేశపెట్టగా నేరం అంగీకరించిన 8 మందికి జరిమానా విధించగా చెల్లించారు. కొత్తగూడెం వన్ టౌన్ ఎస్సై జి.విజయ తనిఖీ చేయుచుండగా ఒక వ్యక్తి వాహనాల రాకపోకలకు అంతరయం కలిగిస్తుందున కోర్టులో ప్రవేశపెట్టగా నేరం అంగీకరించగా ఒక్కరికి జరిమానా విధించారు.



# పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులను అభినందించిన జిల్లా ఎస్పీ



**కొత్తగూడెం, మన భద్రాద్రి బ్యూరో, ఏప్రిల్ 21 :** ఖమ్మంలో జరిగిన రెండు జిల్లాల స్థాయి బెంచ్ ప్రెస్ పోటీలలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జట్టు, మాస్టర్ టీం ఛాంపియన్ షిప్ ను కైవసం చేసుకోగా, భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ కు చెందిన డీవీ శంకర్రావు (రిటైర్డ్ ఎస్బీఐ మేనేజర్) మాస్టర్ నాల్గొవ క్యాటగిరిలో 83 కేజీ విభాగంలో 60 కేజీల బరువు ఎత్తి బంగారు పతకం సాధించారు. అంతేకాకుండా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు మాస్టర్ టీం చాంపియన్ షిప్ కూడా కైవసం చేసుకుంది. అలాగే ఏప్రిల్ 18, 19 తారీఖులలో హైదరాబాదులో జరిగిన క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ పోటీలలో 66 కేజీల విభాగంలో మోడెం వంశీకి బంగారు పతకం, మాస్టర్ రెండవ విభాగంలో 93 కేజీ కేటగిరీలో భవాని శంకర్ రజత పతకం, ఎం రంగారావు మాస్టర్ రెండవ విభాగంలో 105 కేటగిరీలో బంగారు పతకం సాధించినట్లు జిల్లా జనరల్ సెక్రటరీ జీవీ రామిరెడ్డి తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ సోమవారం తన కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా జిల్లాకు మంచి పేరు తెస్తున్న క్రీడాకారులను, జిమ్ కోచ్ లను మరియు జిల్లా అసోసియేషన్ సభ్యులను కూడా ఎస్పీ ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రెటరీ జీవీ రామిరెడ్డి, డీవీ శంకర్రావు, ఎం రంగారావు, భవాని శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# అదనపు తరగతి గది నిర్మాణం, మరుగుదొడ్ల సముదాయాలను ప్రారంభించిన ఎమ్మెల్యే






**పాల్వంచ, మన భద్రాద్రి బ్యూరో, ఏప్రిల్ 21** మండలంలో నవ లిమిటెడ్ పాల్వంచ వారి సహకారంతో కేశవాపురం గ్రామంలో నిర్మించిన అదనపు తరగతి గది నిర్మాణం మరియు మరుగుదొడ్ల సముదాయాలను సోమవారం కొత్తగూడెం నియోజకవర్గ శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, సీఎస్ఆర్ హెడ్ ఎంజీఎం ప్రసాద్, లైసనింగ్ ఆఫీసర్ కదారేంద్ర బాబు, ఏపీపీ రమేష్, తహసీల్దార్ వివేక్, ఆర్ అండ్ బీ డీఈ రామకృష్ణ, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, మార్క్ ఫెడ్ ఛైర్మెన్ కొత్వాల శ్రీనివాసరావు, స్కూల్ హెచ్ఎం హథీరాం, ఎస్ఎంసీ ఛైర్మెన్ శైలజ, గ్రామపంచాయతీ కార్యదర్శి కృష్ణ వేణి, సిపిఐ పట్టణ సహకార కార్యదర్శి ఉప్పుశెట్టి రాహుల్, సిపిఐ నాయకులు గంధం నరసింహారావు, భూక్యా శ్రీనివాస్, బండి నాగేశ్వరరావు, రహ్మాన్, విద్యార్థులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ స్కాం వెనుక ఆర్ఎంపీలదే ప్రధాన హస్తమా..




**ఖమ్మం, మన భద్రాద్రి న్యూస్, ఏప్రిల్ 21**
నగరంలో సీఎంఆర్ఎఫ్ స్కాం కలకలం రేపుతుంది. చికిత్స చేయకుండానే నకిలీ బిల్లులు సృష్టించి, సీఎంఆర్ఎఫ్ నిధులను దుర్వినియోగం చేసిన పది ఆసుపత్రులను మూసివేసినట్లు డీఎం అండ్ హెచ్ఓ వెల్లడించిన విషయం పాఠకులకు విదితమే. ఈ స్కాంలో గ్రామీణ వైద్యులు(ఆర్ఎంపీ) లదే ప్రధాన హస్తంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ప్రభుత్వం దీనిని సీరియస్ గా తీసుకొని, పూర్తిస్థాయిలో విచారణకు సిద్ధం అవుతుంది. అలాగే ఖమ్మం నగరంలో మరికొన్ని ఆసుపత్రులపై కూడా నిఘా పెట్టాలని ప్రజలు ఈ సందర్భంగా కోరుతున్నారు.

# భద్రాచలం శాఖ గ్రంథాలయానికి పుస్తకాల బహూకరణ

**భద్రాచలం, మన భద్రాద్రి బ్యూరో, ఏప్రిల్ 21**



భద్రాచలం పట్టణంలో ఉన్నటువంటి శాఖ గ్రంథాలయానికి ప్రముఖ సంఘ సేవకులు లయన్ గాదె మాధవ రెడ్డి ద్వారా సదా లత కుటుంబ సభ్యులు ఇంజనీరింగ్ విభాగంలో సీఈసీ బుక్స్ సుమారు 25 వేల రూపాయల పుస్తకాలు లైబ్రరీ జానీ కి గాదె మాధవ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ జానీ మాట్లాడుతూ గతంలో 2016లో మరియు 2018లో మాధవ రెడ్డి తల్లిదండ్రుల పేరు మీద బుక్స్ ఇవ్వటం జరిగింది. అలాగే ఒక ఐదు ఫ్యాన్లు కూడా ఇవ్వడం జరిగింది. అదే గొప్ప మనసుతో ఈ రోజున సుమారు 25 వేల రూపాయల ఇంజనీరింగ్ బుక్స్ వారి ద్వారా ఇప్పించటం ఎంతో సంతోషకరమని వారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్టు తెలిపారు. అనంతరం మాధవ రెడ్డి మాట్లాడుతూ ఈ గ్రంథాలయంలో చదువుకున్న విద్యార్థిని విద్యార్థులు పోలీస్ కానిస్టేబుల్ గా, వీఆర్వోలుగా, గ్రూప్ 3, గ్రూప్ 4 గా అలాగే అన్ని రకాల సంస్థలలో కూడా ఈ పది సంవత్సరాలలో చాలామంది ఉద్యోగాలు సాధించటం చాలా గొప్ప విషయమని ఇంకా ఎంతో మందికి ఈ పుస్తకాలు ఉపయోగపడతాయని, ఈ చుట్టుపక్కల ప్రాంతాల వారందరూ కూడా వచ్చి ఈ బుక్స్ ని వినియోగించుకోవాలని ఖచ్చితమైన ఉద్యోగాన్ని సంపాదించాలని ఆకాంక్షించారు. వారి సూచన మేరకు శాఖ గ్రంథాలయానికి బుక్స్ అందజేసిన సదా లత కుటుంబ సభ్యులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు గాదె మాధవ రెడ్డి, లైబ్రేరియన్ జానీ, గ్రంథాలయం లోని పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

# నిజాయితీని చాటుకున్న కొమ్మిని శోభన్ బాబు

## అభినందించిన ఎస్సై బాదావత్ రవి




**జూలూరుపాడు, మన భద్రాద్రి న్యూస్, ఏప్రిల్ 21**
మండల పరిధిలోని సూరారం గ్రామానికి చెందిన ఓ మహిళ తన కూతురుతో కలిసి కొత్తగూడెం వెళ్లేందుకు జూలూరుపాడు బస్టాండ్ వద్ద బస్సు కోసం నిరీక్షిస్తుంది. ఈ క్రమంలో ఆమె మెడలోని రెండు తులాల నల్లపూసల గొలుసు జారి కింద పడిపోయింది. ఈ క్రమంలో మండలంలోని అన్నారుపాడు గ్రామానికి చెందిన కొమ్మిన్ని శోభన్ బాబుకు నల్లపూసల గొలుసు దొరికింది. సదరు యువకుడు జూలూరుపాడు ఎస్సై బాదావత్ రవి, హెడ్ కానిస్టేబుల్ దయానంద్ సమక్షంలో రూ. రెండు లక్షల విలువ చేసే నల్లపూసల గొలుసును మహిళకు అప్పగించాడు. దీంతో ఎస్సై శోభన్ బాబును అభినందించారు.

# మాదక ద్రవ్యాల పట్ల అవగాహన సదస్సు




**ఇల్లందు, మన భద్రాద్రి న్యూస్, ఏప్రిల్ 21**
పట్టణ పరిధిలోని మార్గదర్శిని హై స్కూల్ లో స్కౌట్స్ అండ్ గైడ్స్ నూతన విద్యార్థులచే ప్రమాణస్వీకారం నిర్వహించడం జరిగినది. ఇంపాక్ట్ ఫౌండేషన్ వారు మరియు స్కౌట్స్ అండ్ గైడ్స్ వారి ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ నిర్వాహకులు, సెక్రటరీ ఎం శ్రీనివాసరావు, డిస్టిక్ జాయింట్ సెక్రెటరీ ఎన్ భారతమాత, ట్రైనింగ్ కమిషన్ మరియు డిస్టిక్ ట్రైనింగ్ కమిషనర్ పీవీ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

# అన్న ప్రాసన వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే తెల్లం

**భద్రాచలం, మన భద్రాద్రి బ్యూరో, ఏప్రిల్ 21**
పట్టణంలోని రెడ్డి సత్రంలో సోమవారం వల్లభ రెడ్డి రాము – లహరి కుమారుడు లోకేష్ అన్న ప్రాసన వేడుకలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నారుడిని అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజా ప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# డయాలసిస్ రోగులకు ప్రభుత్వం పెన్షన్లు ఇవ్వాలి

**-బానోత్ దుర్గాప్రసాద్ డిమాండ్**



**జూలూరుపాడు, మన భద్రాద్రి న్యూస్, ఏప్రిల్ 21**
మండల కేంద్రంలోని పీహెచ్సీని సీహెచ్సీగా ఏర్పాటు చేసి, డయాలసిస్ సౌకర్యం కూడా కల్పించి, డయాలసిస్ రోగులకు ప్రభుత్వం పెన్షన్లు ఇవ్వాలని భారతీయ గోర్ బంజారా పోరాట సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు బానోత్ దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. రోగులకు పెన్షన్లు ఇవ్వడంలో ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తుందని ఆయన ఆరోపించారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ డయాలసిస్ రోగులకు 2000 రూపాయలు పెన్షన్ ఇవ్వాల్సిన ప్రభుత్వం, చాలా మందికి పెన్షన్ ఇవ్వడం లేదని ఆరోపించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో డయాలసిస్ చేసుకుంటున్న రోగులకు పెన్షన్లు ఇచ్చిన పాపాన పోలేదని అన్నారు. ఆంధ్రాలో డయాలిసిస్ రోగులకు అక్కడి ప్రభుత్వం పెన్షన్ లిస్తుందని, ఇక్కడ మాత్రం రోగులను గాలికి వదిలేసారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలని, లేని పక్షంలో బీజీబీఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు చరణ్ నాయక్, రాంబాబు నాయక్, నాయకులు, పాల్గొన్నారు.

# ఉద్యమకారుల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్సీ కవితను కలిసిన సిలివేరి



**ఇల్లందు, మన భద్రాద్రి న్యూస్, ఏప్రిల్ 21**
ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రెండు రోజుల పర్యటనను ప్రారంభించారు. ఈ పర్యటనలో భాగంగా భద్రాచలం చేరుకున్న ఆమెకు బీఆర్ఎస్ నాయకుల నుంచి ఘన స్వాగతం లభించింది.తెలంగాణ రాష్ట్ర జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సోమవారం భద్రాచలంలోని హరిత హెూటల్ లో నిర్వహించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా ఉద్యమకారుల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ తాతా మధు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రేగా కాంతారావు,మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వర రావు, చంద్రావతి, హరిప్రియ నాయక్, మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉద్యమ నాయకులు సిలివేరి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా ఖమ్మం జిల్లాకు ఎలాంటి ప్రయోజనం లేదని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రెవంత్ రెడ్డి రైతుల సమస్యలపై స్పందించకపోవడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు కనీస నష్ట పరిహారం ఇవ్వని ప్రభుత్వం అని అన్నారు. ఖమ్మం జిల్లా విప్లవాలకు నిలయమైనా, ప్రస్తుతం కమ్యూనిస్టులు మౌనం వహిస్తున్నారని విమర్శించారు. ఇప్పటిదాకా అధికారంలో ఉన్నవారిని ప్రశ్నించే కమ్యూనిస్టులు, ఇప్పుడు ప్రభుత్వ భాగస్వాములుగా ఉండటంతో ప్రశ్నించడంలేదని కవిత వ్యాఖ్యానించారు. కేసీఆర్ హయాంలో భక్త రామదాసు ప్రాజెక్టు పూర్తి చేసి రైతులకు నీటిని అందించామని గుర్తు చేశారు. ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 15 నెలలు గడిచినా ఒక్క ప్రాజెక్టును ప్రారంభించలేకపోయిందని విమర్శించారు. రైతులకు రుణ మాఫీ, కూలీలకు ఆత్మీయ భరోసా వంటి వాగ్దానాలు కూడా నిలబడలేదని పేర్కొన్నారు. వచ్చే 27 వ తేదీన వరంగల్లో జరిగే బీఆర్ఎస్ 25 వ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు పట్టణ నాయకులు సంద ప్రవీణ్, కిరణ్, మాజీ కౌన్సిలర్ లలిత శారద, అబ్దుల్ నబి, యువజన నాయకులు గిన్నారపు రాజేష్, రవికాంత్, శ్రీను, శాతల హరికృష్ణ, హరిప్రసాద్ యాదవ్, లలిత్ పాసి, తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశం

**ఐటీడీఏ పీవో బి. రాహుల్**





**భద్రాచలం, మన భద్రాద్రి బ్యూరో, ఏప్రిల్ 21**
వివిధ ఆదివాసీ గిరిజన గ్రామాల నుండి ఎంతో నమ్మకంతో తమ సమస్యలను విన్నవించుకోవడానికి గిరిజన దర్బార్లో దరఖాస్తులు చేసుకుంటున్న ఆదివాసీ గిరిజన కుటుంబాలకు సంబంధిత యూనిట్ అధికారులు వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన గిరిజన దర్బార్లో వివిధ ఆదివాసీ గిరిజన గ్రామాల నుండి వచ్చిన గిరిజనుల నుండి అర్జీలు స్వీకరించి, తన పరిధిలో ఉన్నవి వెంటనే పరిష్కరించి, మిగతా వాటిని సంబంధిత అధికారులకు పంపుతూ అర్హులైన ప్రతీ గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అందే విధంగా సంబంధిత యూనిట్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఎక్కువ శాతం దరఖాస్తులు పోడు భూముల సమస్యలు, వ్యక్తిగత సమస్యలు, ట్రైకార్ ద్వారా అందించే సబ్సిడీ రుణాల కొరకు, కొత్తగా ఏర్పాటు చేసే మత్స్యకార సొసైటీల అనుమతి కొరకు, వ్యవసాయానికి సంబంధించి కరెంటు, బోరు, మోటారు కొరకు, జీవనోపాధి పెంపొందించుకోవడానికి వ్యక్తిగత రుణాలు ఇప్పించుట కొరకు, ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో ఉపాధి పొందుటకు శిక్షణలు ఇప్పించుట కొరకు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఏఎన్ఎం పోస్టులు ఇప్పించుట కొరకు, దీర్ఘకాలిక రోగాలకు వైద్యం చేయించుకోవడానికి ఆర్థిక సహాయం ఇప్పించుట కొరకు మరియు కళ్యాణ లక్ష్మి, రైతు బంధు, ఒంటరి మహిళలకు ఆర్థిక సహాయం ఇప్పించుట కొరకు, కిరాణా షాపులు, ఫ్యాన్సీ స్టోర్ లు, పెట్టుకోవడానికి బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పించుట కొరకు, గిరిజన గ్రామాలలో మంచినీటి సౌకర్యం కల్పించుట కొరకు గిరిజనులు అర్జీలు పెట్టుకున్నారని ఆయన తెలిపారు. గిరిజన దర్బార్ లో వచ్చిన దరఖాస్తులను ఆన్లైన్ ద్వారా ప్రత్యేక రిజిస్టర్లో నమోదు చేసి, అర్హులైన ప్రతి గిరిజన కుటుంబాలకు విడతల వారీగా, ప్రభుత్వం ద్వారా ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు అందించడానికి చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని మణెమ్మ, ఆర్ సీ ఓ గురుకులం నాగార్జున రావు, ఎస్ డీ సీ రవీంద్రనాథ్, ఏవో రాంబాబు, ఎస్ ఓ భాస్కరన్, ఏపీఓ, డి టి ఆర్ ఓ ఎఫ్ లక్ష్మీనారాయణ, డి టి ఎల్ టి ఆర్ మనిధర్, ఉద్యానవన అధికారి ఉదయ్ కుమార్, కొండరెడ్ల విభాగం అధికారి నరేష్, మిషన్ భగీరథ ఏఈఈ నారాయణ రావు, మేనేజర్ ఆదినారాయణ, జేడియం హరికృష్ణ, హెచ్ ఈ ఓ లింగా నాయక్, వివిధ విభాగాలకు చెందిన సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం

**మొదటి రోజు 139 గైర్హాజరు**



**ఖమ్మం, మన భద్రాద్రి న్యూస్, ఏప్రిల్ 21**
ఖమ్మం జిల్లాలో ఓపెన్ స్కూల్, ఇంటర్మీడియట్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు ఓపెన్ పదోతరగతి పరీక్షలకు 488 మందికి గాను, 420 మంది హాజరు కాగా, 68 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్మీడియట్ పరీక్షకు 646 మందికి గాను, 575 మంది హాజరు కాగా, 71 మంది గైర్హాజరయ్యారని డీఈవో సోమశేఖర శర్మ సోమవారం తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగుతున్నాయని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# ఘనంగా ఈస్టర్ పండుగ వేడుకలు

**టేకులపల్లి, మన భద్రాద్రి న్యూస్, ఏప్రిల్ 21**



మండలంలో ఈస్టర్ పండుగ వేడుకలు ఆదివారం తెల్లవారుజాము నుండి టేకులపల్లి మండలంలో ఉన్న శాలెం ఇమ్మానుయేల్, ఏ.సి.ఏ, సిఎస్ఐ ఆర్.సి.యం మరియు మరనాత చర్చిలలో ఈస్టర్ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ బల్లెం జాన్ రాజ్ పాల్గొని మాట్లాడుతూ ఏసు క్రీస్తు ప్రభువు వారు 2000 సంవత్సరాల క్రితం ఈ భూమి మీదికి వచ్చి సర్వ మానవాళి రక్షణ కొరకు తన రక్తము కార్చి ప్రాణ త్యాగం చేసి మరల మూడవ రోజు తిరిగి లేచాడని వారు తెలియజేశారు. క్రైస్తవ్యం అంటే మతం కాదని ఇది ఒక మార్గమని మనుషులు తమ చెడు వ్యసనాలు మాని సన్మార్గంలో నడుస్తున్నారని వారన్నారు. నేనే మార్గం నేనే సత్యం నేనే జీవమని చెప్పిన ఏకైక దేవుడు యేసు క్రీస్తు ప్రభువు వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బి రవీందర్, సమ్మయ్య, బిచ్చ, గాంధీ, ప్రవీణ్, లక్ష్మణ్, ప్రశాంత్, క్రైస్తవ భక్తులు పాల్గొన్నారు.

# జాబ్ మేళాను ప్రారంభించిన డిప్యూటి సీఎం

**ఖమ్మం(మధిర), మన భద్రాద్రి న్యూస్, ఏప్రిల్ 21**
మధిరలోని రెడ్డి గార్డెన్లో నిర్వహించిన మెగా జాబ్ మేళా కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సోమవారం ఉదయం ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు అండగా ఉంటుందని, ప్రతీ ఒక్క నిరుద్యోగి ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీజ, పలు శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

